
# ఎక్కడ వెదుకుతున్నాను




బ్రేకు లొదిలేసిన బండిలా సర్రున వచ్చిన ముత్యాలు అక్కడి దృశ్యాన్ని చూసి సడన్ బ్రేక్ వేసినట్టు ఆగబోయి తూలి ముందుకు పడిపోయాడు. ఆ పడటం వంద కేజీల బియ్యం బస్తాలా ముందుకు పడి నేల మీద ఏదో వెదుకుతున్న కానిస్టేబుల్ కనకరాజు మీద పడ్డాడు.

అయినా అతగాడిలో చలనం లేదు. నేల మీద పడి ప్రతి అంచీ నేలనీ అతి జాగ్రత్తగా వెదుకుతున్నాడు. అతడే కాకుండా మరో నలభై మంది కానిస్టేబుల్స్ కూడా అదే పని మీద ఉన్నారు.

కొందరు వెదుకుతుంటే, మరి కొందరు మోకాళ్ళ మీద నడుస్తూ వెదుకుతున్నారు. మిగిలిన వాళ్ళు దేకుతున్నారు. అది చూసే వాళ్ళకు ఖాకీరంగు గొర్రెలు గుంపుగా మేస్తున్నట్టు, అక్కడ లాఠీ పట్టుకు నిలుచున్న హెడ్డు ఖాకీరంగు కాపరిలా కనిపిస్తున్నాడు.

వాళ్ళతో పాటు ముత్యాలూ కొంత సేపు వెదికాడు. కాని అతగాడి కళ్ళకేమీ కనిపించలేదు, దొరకనూ లేదు. దొరకకపోతే పోయింది. అసలు వాళ్ళు వెదుకుతున్న దేమిటో కూడా అర్థం కాలేదు. కాకపోతే పోయింది. ఇంతకూ తనొచ్చిన పని ఎవరితో చెప్పాలి?... ఎవరూ వినిపించుకునే పరిస్థితిలో లేరే!.... లేకపోయినా చెప్పి చూడటం తన కర్తవ్యం. కర్తవ్య మేమిటి తన బొంద. ఎనిమిదొందలు పెట్టి కొన్న ఏ క్లాస్ సైకిల్ ఎవడో ఎత్తుకు పోయాడు. ఆ విషయం చెపుదామంటే సామూహికంగా వీళ్ళేదో పారేసుకుని వెదుక్కుంటున్నారు. వీళ్ళనిప్పుడు కదిపితే 'తనే అదేదో దొంగిలించాడని కేసు బనాయించినా బనాయిస్తారు.' అని అనుకుని ముత్యాలు లేచి నిలుచున్నాడు. వెళ్ళి

పోవాలని. కాని అతని కక్కడి నుండి కదల బుద్ధికాలేదు. తన సైకిల్ పోయినందు కక్కడికి వచ్చినా, అసలు వాళ్ళిదుకుతుందేమిటో తెలుసు కోవాలన్న ఆతృత ఎక్కువయింది. అందుకే మరలా కర్రా బిల్లా ఆట కోసం వంగినట్టు వంగి, ఇందాకటి కానిస్టేబుల్ కనకారావు గారి రేడియో దొక్కు లాంటి చెవిలో మూతి పెట్టి అడిగాడు. కాదు, ముందు పిలిచాడు.

"సార్!...."

పలుకలేదు.

"మీరు వెదుకుతున్న దేమిటి సార్?...."

అబ్బే! ఫలితం లేదు.

"మీరు వెదికే దేమిటో చెపితే నేనూ వెదికి పట్టుకుంటాను సార్!..."

అసలు లాభం లేదు.

"కానిస్టేబుల్ గారూ!..." ఈ సారి అరిచాడు.

ఊఁ హూ!....

ఇక ఆగలేక పోయాడు ముత్యాలు. గబుక్కున ఆ కానిస్టేబుల్ చెవి కొరికేసాడు. దానికా కానిస్టేబుల్ కనకారావు కివ్వున అరవలేదు. ఏదో ఈగో, దోమో వాలిందనుకున్నాడు కాబోలు నేల మీద ఉన్న ఎడం చేయితో ఆ ఈగనో, దోమనో తోలే ప్రయత్నం చేసాడు. ఆ చేయి ముత్యాలు మూతికి తగిలిరివ్వున నాలుగించీలకు తక్కువ కాకుండా వాచి టి. వి. ఆంజనేయుడి మూతిలా అయిపోయింది.

"బాబోయ్..." అంటూ మూతి పట్టుకుని అలా కూర్చుండి పోయాడు ముత్యాలు. అది చూసిన హెడ్డు లాఠీ ఊపుకుంటూ వచ్చి, "గొర్రెల మధ్యకు మేక పిల్లిలా వచ్చిందా!" అన్నట్టు చూసి, "ఎవర్రా నువ్వు?..." అన్నాడు.

"నేను... మూతి..."

"మూతి కనబడతానే ఉంది వాచి!.... ఇంతకూ నువ్వు..."

"అది కాదు సార్!... నా పేరు ముత్యాలు."

"ఇక్కడ ముత్యాలతో పనిలేదు. ఇక్కడుండేవి రాళ్ళు రప్పలే! ఎల్లు!..."

"అదికాదు సార్!... నా సైకిల్..." అందోళనగా అన్నాడు.

"పోయిందా?"

"అవును సార్!..."

"ఇమానాలే పోతన్నాయ్!.... బోడి సైకిల్ కోసం బెంబేలెత్తి పోతావేట్రా!... ఎల్లి ఎతుక్కో..."

"మరి, మీరు..."

"మాకు తీరిక నేదు!... సూసావుగా!... ఫంక్షనైన పావుగంట నుంచి మావోళ్ళు ఎలా కష్ట బడుతున్నారో!... మా సేవ అట్టాటిది!..." లంక పొగాకు చుట్ట తీసి గార పట్టిన పళ్ళ మధ్యకు ఇరికించాడు, హెడ్డు దీమాగా!....

"ఇంతకూ వాళ్ళు వెదుకుతున్నది దేని గురించి సార్!..."

"నీకు తెలవదా?..."

"తెలియదు సార్!..."

"తెలవకపోతే సెప్తాను ఇనుకో!... ఈయాల ఈ కొత్త పోలీస్ స్టేషన్ ఓపెనింగ్‌కి డియస్పీ గారి భార్య ఒచ్చింది. ఆమె ఓపెనింగ్ సేసి స్పీచ్ ఇచ్చి కూర్చునే సరికి ఆమె జుట్టులోంచి సెంవ పిన్ను జారి పడిపోయింది. అలా జారి పడిపోవడం మా గుడ్డి మేళం గాళ్ళలో ఒక్కడు కూడా సూడనేదంట!... అందుకే ఈ వెదుకులాట...."

"ఇదేమిటి సార్!... పదిహైన లెస్త దొరికే చెంప పిన్ను కోసం ఇంత మంది పని మానుకుని ఇలా వెదకడం ఏమీ బాగున్నట్టు లేదు సార్!..."

"తమరు నోరు మూసుకుని ఇక్కడి నుండి ఎల్లండి సార్!... మీ మాటలు గాని మా ఎస్సయ్‌గారు ఇన్నారంటే నీతో పాటూ నన్నూ నాలుగు తన్ని తగిలేయగలదు సార్!..." అని వెటకారంగా అని ముత్యాల వైపు కొరకొరా చూసాడు హెడ్డు.

"మరి నా సైకిల్...."

"రిపోటు రాసిచ్చి వెళ్ళవయ్యా!.... నీకు యోగముంటే అదే దొరుకుతాది."

"లేకపోతే సార్!..."

"ఇంతే సంగతులు సార్!...."

"అలా అనకండి సార్!... చాలా కష్టపడి పైసా పైసా కూడబెట్టి ఆ సైకిల్ కొనుక్కున్నాను సార్! అది దొరకక పోతే పది మైళ్ళు నడిచి వెళ్ళి కాంట్రాక్టు పని చేసుకోవడం చాలా కష్టం సార్!..."

"ఓ పని చేయవోయ్ వజ్రాలు..."

"నా పేరు ముత్యాలు సార్!..."

"ఏదో ఒకటి లేవయ్యా!... రోజూ మా స్టేషన్‌కి వస్తూ ఉండు. మా వేన్ మీద మీ డ్యూటీకి దే బెడతాం!... సరేనా?..."

"మీకెందుకు సార్! అంత శ్రమ!"...

## దత్ అయితేమాత్రం....?



సునీల్ దత్‌ను రేఖ ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు త్రాగిస్తోందట. వరకట్న చావులపై దత్ తాను నిర్మిస్తున్న "ఏ ఆగ్ కబ్ భుజేగీ" చిత్రంలో డింపుల్ కపాడియాను తొలగించి రేఖకు ఆ అవకాశం యిచ్చాడు. కాని రేఖ అది దుర్వినియోగం చేస్తోంది. అంతేకాదు ఒకరోజుషూటింగ్‌తో ప్యాచ్ వర్క్ పూర్తవుతుందనుకున్న ఈ చిత్రం గత మూడు నెలలుగా ఆలస్యమవటానికి కారణం రేఖ షూటింగ్‌కు హాజరు కాకపోవటమేనట. దత్‌ను ఈ విధంగా ముప్పతిప్పలు పెట్టటంతో అనవసరంగా రేఖను బుక్‌చేసి తలనొప్పి తెచ్చుకున్నానని సునీల్ దత్ బాధపడుతున్నాడు. తప్పేదేముంది?!

## మౌనంలో దాగున్న మనిషి

నేర పరిశోధన పథంలో వినూత్న ప్రయోగాలు
నేర నిర్వహణా క్రమంలో ఎత్తుకుపైఎత్తులు!
అవయవాల్ని నరికి అంగాల్ని చీల్చి
చంపబడ్డది మనిషో మృగమో తేల్చడానికి
ఫోరెన్‌సిక్ లాబరేటరీ ప్రతిభకే పరీక్షగా తయారైంది!
రోడ్లపై స్థాపించిన ఆటవిక రాజ్యంలో
సెంట్రీ తుపాకి సెంట్రీ రక్షణకే అంకితమై
సగటు మనిషి బ్రతుక్కి సెక్యూరిటీ మృగ్యమైంది!
యధాతథంగా
అర్థరాత్రి చీకట్లో పురుడు పోసుకొని
మరో రోజును అంధకారంలో కని
చీకటి పొత్తిళ్లలో పూర్వార్థాన్ని పెరగమంది!
ఎక్కడ కాంతి అవసరమో అక్కడ
వీధిలైటు అలా అలా రెప్పలు ఆడిస్తూ
తనకై తాను ఆరిపోతున్నట్లు
నటించి నటించి కన్నుమూసింది!
పూర్వార్థం ఉత్తరార్థమై ఉరకలెయ్యగా
చీకటి చేసిన నరమేధం
వెలుగును చీకట్లోకి తరుముకెళ్లింది!

గాయాలు తగిలిన చోట నగిషీలు చెక్కబడతాయి
చూపులు నగిషీలపై ఎక్సరేలై నిలబడగానే
చూపులకు ఫ్రేములు కట్టబడతాయి
అన్ని చూపులూ రెటీనాపై ముద్రించబడి
అన్ని చేష్టలూ మెదడున దాచబడతాయి
భయం మనిషిని మౌనంలో దాచుకొంటుంది
మనసు మనిషి మౌనాన్ని భేదించమంటుంది!

-అడిగోపుల వెంకటరత్నమ్

కాస్త సిగ్గుపడ్డాడు ముత్యాలు.

"శ్రమనుకుంటే ఎలాగయ్య మాకు?.. మా పని మీలాంటి వాళ్లను మోసుకు తిరగడమేగా!.. నీ సైకిల్ మేము పట్టి తీసుకొచ్చేవరకూ మాకు తప్పదు కదా?..."

"ఏమిటో సార్! మీరు మాట్లాడు తుందేమిటో నాకర్థం కావడం లేదు".

"అర్థం కాదయ్యా!... మరో రెండు నిముషాలు ఇక్కడే నించున్నావంటే నాలుగంటించి లాకప్పులోకి తోసానంటే అప్పుడర్థమవుద్ది, పూర్తిగా!..."

"ఇది అన్యాయం సార్!... సైకిల్ పోయి నేను బాధ పడుతుంటే!...

"చెంప పిన్ను పోయి మేము మాత్రం బాధపడటంలేదనుకుంటున్నావా?..."

"చెంప పిన్ను, నా సైకిలూ ఒకటే నటండి?"-

"ఓరినీ!... అది ఎవరి పిన్ననుకున్నా వురా?... డియ్యస్పీ గారి భార్యగారిది".

"ఓ పనిచేయండి సార్!..."

చెప్పండి సార్!..." మరి కాస్త వెటకారంగా అన్నాడు హెడ్డు.

"ఓ పిన్ను కొనేసి దొరికిందని ఇచ్చేస్తేనో సార్!..."

"ఆ మాత్రం ఐడియా మాకు రాకపోనే దురా కుర్రకుంకా!... అసలు ఆమె ఏ రకం పిన్ను పెట్టుకుంది?... దాని పొడవెంత? వెడల్పెంత?... దానికెన్ని వంకీలు ఉన్నాయి?.. ఈ ఇవరాలెలా తెలుస్తా యిరా?..."

"ఆమె జడలో మరో పిన్ను ఉంటుంది కదా సార్!..."

"అదడిగి తెమ్మంటావా?... బోడి సలహా చెప్పావంటే బొక్కలోకి తోసీగల్ను! .."

"అయినా అంత పెద్ద ఆఫీసర్ భార్య ఆ పిన్నును ఎలా జారేసుకోగలిగింది సార్?..."

"ఏం? ఆఫీసర్ భార్యలు జారేసుకోరని ఎక్కడైనా రాసుందా?..."

"అలా కాదనుకోండి!"... అంటూ అంతలోనే ఏదో గుర్తొచ్చినట్టు, "సార్! చెంప పిన్ను దొరికితే, ఆ తరువాత నా సైకిల్ కేసు టేకప్ చేస్తారా?..." అని అడిగాడు.

"ఓ తప్పకుండా!..." అన్నాడు హెడ్డు. అప్పుడే పిన్ను దొరికిపోయినంత ఆనందంగా!...

ఆ మాట వింటూ ముత్యాలు అక్కడి నుండి వెళ్లిపోయాడు వడివడిగా అడుగులేస్తూ!...

దేకుతూ, పాకుతూ, ఒంగుతూ కానిస్టే బుల్స్ మాత్రం కాళ్ళు, ముడుకులూ, అరిగిపోయేలా అక్కడంతా వెదుకుతూనే ఉన్నారు.

* * * * *

సాయంత్రం ఆరు గంటలయింది. శీతాకాలం రోజులు గనుక తొందరగా చీకట్లు అలుముకోసాగాయి.

చెంప పిన్ను కోసం వెదుకుతున్న కానిస్టేబుల్సంతా కళ్ళు మూసుకుని ఎక్కడివాళ్ళక్కడ కూర్చుండిపోయారు.

ఏం చేయాలో తోచని హెడ్డు, అప్పటికే వచ్చి పిన్ను దొరకలేదని తెలిసి మండిపడిపోతున్న ఎస్సయ్ పరమేష్ కలిసి కాలు కాలిన పిల్లుల్లా స్టేషన్లో అటూ ఇటూ తిరగసాగారు.

ఇంతలో పరుగున వచ్చాడు ముత్యాలు.

"సార్! పిన్ను దొరికింది". ఆనందోత్సాహంతో అంటూ పిన్ను చివర పట్టుకుని పైకెత్తి చూపించాడు.

లక్ష రూపాయల ఇనామ్ ఉన్న టిక్కెట్టు దొరికినంత ఆనందంతో అంతా ముత్యాలు చుట్టూ చేరారు.

"నాకివ్వు!" అంటే "నాకివ్వు!" అంటూ పార్టీ టిక్కెట్టు కోసం ఎగబడే రాజకీయ అభ్యర్థుల్లా పోటీపడసాగారు. ఆ హడావిడికి ఎస్సయ్, హెడ్డు స్టేషన్

లోంచి బయటకొచ్చారు.

"ఏమిటి?... ఏమిటయింది?..."

"పెన్ను దొరికింది సార్!..."

ఆ మాట వింటూనే ఎస్సయ్ పరమేష్ ముందుకొచ్చి ముత్యాలు చేతిలో పెన్ను తీసుకుని చూసి, "వెరీ గుడ్!... ఎక్కడ దొరికింది?" అని అడిగారు.

"రోడ్డు మీద సార్!... అనవసరంగా అక్కడ వెదికారు". అంటూ నవ్వాడు ముత్యాలు.

"ఓ. కే. డియ్యెస్పీ గారితో చెప్పి నీకు ప్రమోషన్ ఇప్పిస్తాను".

"నాకా?... నేనీ డిపార్టుమెంటువాణ్ని కాను సార్!..."

"కాకపోతే రప్పిస్తామయ్యా!..."

"అలాగే సార్!..." అంటూనే ముత్యాలు ఆనందపడిపోతూ ఆశపడిపోయాడు. ఆ ఆశతోనే స్వప్న లోకాల్లోకి తేలిపోయాడు. మట్టి కంపు కొట్టే కాంట్రాక్టు పని మానేసాడు. డ్రిల్ నేర్చేసుకున్నాడు. లాఠీ పట్టేసుకున్నాడు. ఊరు మీద పడి మామూళ్ళు వసూలు చేసేసి మానభంగాలకి తయారయిపోయాడు. రాడికల్స్‌ని బంధించి వాళ్ళను లాకప్ మరణాలుగా జమ చేసేస్తున్నాడు.

అప్పుడే!...

ఎక్కడో "ధన్"మని ఓ గన్ పేలి గుండు దూసుకొచ్చి ముత్యాలు తలలోంచి దూసుకు పోయింది.

బేరుమన్నాడు ముత్యాలు.

"నాకొద్దు బాబోయ్! ఈ ఉద్యోగం!"

చెంప పెన్ను పట్టుకుని ఊబిక్కుతున్న ఎస్సయ్ వెనుతిరిగి, "ఏంటయింది వాడికి?..." అన్నారు.

## ఎరక్క ఇరుక్కున్నాను

"ఏమో సార్!... ఉద్యోగమొద్దంటున్నాడు".

"అయితే పొమ్మనండి!..."

"నా సైకిల్ సార్!..."

"నేను మరలా వచ్చేవరకూ ఉండు. సరైన సైకలిప్పిస్తాను". అన్నాడు ఎస్సయ్. జీప్ ముందుకెళ్ళిపోయింది.

* * * * *

"వాట్!... దిసీజ్ మై పెన్?..." ఎస్సయ్ పరమేష్ చేతిలో చెంపపిన్నును చూసి ఆశ్చర్యంగా అడిగింది, డియ్యెస్పీగారి భార్య.

"ఎస్! మేడమ్!... అక్కడ ఇదే దొరికింది".

"ఎవరికి దొరికింది?..."

"నా... నాకే మేడమ్!..." ఈ దెబ్బతో తను సి. ఐ. కావడం ఖాయమనుకున్నాడు ఎస్సయ్!...

"యూ బ్రూట్!... అగ్లీ!... టిన్ ఎన్ పి కాస్ట్లు చేసే పిన్ పెట్టుకునే దానిలా నేను కనిపిస్తున్నానా?... లేక నా 'పెన్' దాచేసి ఇది చూపిస్తున్నారా!.."

ఈసారి కంగారుపడి పోయాడు ఎస్సయ్ పరమేష్!...

"నో!... నో మేడమ్! ఇది..."

"ఇది కాదు. నేను పారేసుకుంది, గోల్డెన్ పెన్. అది తీసుకురండి".

ఆ మాట విని త్రుళ్ళిపడ్డాడు ఎస్సయ్ పరమేష్!... 'బంగారపు పెన్నా!... అంటే దాన్ని ఆ కుర్రవెధవ దాచేసి ఈ పెన్ను... వచ్చినంత వేగంగా అక్కడ సెలవు తీసుకుని జీపులో స్టేషన్‌కి వచ్చాడు.

పరమేష్!..

"ఏడి! ఏడి ఆ పుండాకోర్ రాస్కెల్!..."

ఎదురుగా వచ్చి నించున్నాడు ముత్యాలు నవ్వుతూ!... పెద్దయ్య గారు ఇచ్చింది, తన కిచ్చేయడానికి ఎస్సయ్ గారు తెగ తొందరపడి పోతున్నారనుకున్నాడు.

ముత్యాలు ఎస్సయ్‌కి కనీ కనిపించగానే పడేల్ మని కొట్టి ఫెల్లు పట్టుకుని ఈడ్చుకెళ్ళి లాకప్పులోకి తోసి తాళం వేసాడు. వేసి, హేండ్ స్టిక్‌తో చేతి మీద కొట్టుకుంటూ ... పెద్ద డిటెక్టివ్‌లా ఫోజు పెట్టి, "చెప్పు! బంగారపు చెంప పిన్ను ఎక్కడ దాచావు?..."

"దాన్ని మీ ఆవిడ పారేసుకుందా సార్?"... అన్ని దెబ్బలు తిని అమాయకంగా అడిగాడు ముత్యాలు.

"గోల్డ్ పెన్ దాచేసి, నకిలీ పెన్ ఇచ్చి, ఇప్పుడు మా ఆవిడ్ని కూడా పారేసుకోమంటున్నావా?... మర్యాదగా చెప్పు ఆ పెన్నెక్కడ?... లేకపోతే లాకప్ మరణాల సంఖ్యలో కలిపేయగలను".

ఆ మాట వింటూనే తల పట్టుకుని, "బాబోయ్! నాకేమీ తెలియదు. పెన్ను దొరికితే నా సైకిల్ వెతికి పెడతారని ఆశపడి, పది పైసలిచ్చి ఈ పెన్ను కొని దొరికిందని తీసుకొచ్చిచ్చాను. సైకిల్ పోయే, పది పైసలూ పోయే!... పోతే పోయాయి గాని నన్నొదిలేయండి బాబూ!... మీకు దండం పెడతాను!..." అంటూ గొల్లుమన్నాడు.

●

